



కాలింగ్‌బెల్ నొక్కడంతోనే ఓ వయసు మళ్లినావిడ తలుపు తీసి, ఎవరు? ఎందుకొచ్చావ్? ఎవరు కావాలి? అన్నట్టుగా చూసింది.

"నేను సురేష్ ఫ్రెండ్ నరేంద్రని... మాకు పాప పుట్టిందని, స్వీట్స్ యివ్వాలని వొచ్చాను..." ఉత్సాహం, సంతోషం కల్సిన ముఖంతో ఆమెను చూస్తూ అన్నాడు.

ఆత్మీయులతో సంతోషాన్ని పంచుకుంటే రెట్టింపవుతుంది.

"కూర్చుందువు రా నాయనా... మా అబ్బాయి సురేష్ ఇంకా రాలేదు..." అందామె.

అతని మాటలు విన్న సురేష్ భార్య ఇందిర ఆశ్చర్యంగా అతన్నే చూసింది కాసేపు.

"జోక్ చేసేందుకు చెప్తున్నట్టున్నావ్... ఆడపిల్ల పుడ్తే... స్వీట్లివ్వడం... నిన్నే చూస్తున్నాం. ఎప్పుడూ... ఎవ్వరూ... యిట్టా యిచ్చినోళ్లని ఎక్కడా చూళ్లేదు..." అందామె కళ్లు చిట్లించి

దోర్నాదుల సుబ్బమ్మ

# అత్తగారూ జిందాబాద్

చూస్తూ.

డైనింగ్ టేబిల్ తుడుస్తున్న విమలమ్మ, 'అవునవునక్కా...' అంది సమర్ధిస్తూ.

లోపల్నుంచి వచ్చిన ఐదేళ్లు, మూడేళ్లున్న పాపలిద్దర్నీ చూసి, వీళ్లు మీ పిల్లలే కదా' అడిగాడు నరేంద్ర.

"ఆ..." అంది ఇందిర.

"ఊ... మావాడి పాలిటికి తయారైనారు..." ఆగి ఆగి దీర్ఘం తీసింది సురేష్ తల్లి.

ఇద్దరాడపిల్లల పుట్టుక సమయంలో... తప్పంతా తనదే అయినట్టు, జరగరాని ఘోరం జరిగిపోయినట్టు నానా గొడవా చేసింది అత్తగారు. ఓపక్క సిజేరియన్... మరోపక్క స్కానింగ్‌లో ఆడపిల్లని తెల్సినప్పుడే అబార్షన్ చేయించుకోలేదని ఎన్నెన్ని మాట్లాడిందో గుర్తొచ్చి, కడుపులో దేవినట్లనిపించింది ఇందిరకు.

వాళ్ల మొఖాల్లో ఫీలింగ్స్ చూసి, అయోమయంలో పడ్డాడు నరేంద్ర. నా గురించి వాళ్లు పొరబడ్తున్నారా... లేక నేనే వాళ్లగురించి పొరబడ్తున్నానా... ఎటూ తేల్చుకోలేక అతనిలో ఉన్న ఆనందం ఆవిరైపోయింది.

"జ్యూస్ తాగండన్నయ్యా..." యిచ్చింది ఇందిర.

"మా అబ్బాయికి చెప్పి, మీ యింటికొస్తాం చూడ్డానికి..." అంది సురేష్ తల్లి.

"తప్పకుండా రండి" అంటూ బయటికి వెళ్లిపోయాడు నరేంద్ర.

బైట స్కూటర్ స్టార్ట్ చేస్తున్న నరేంద్రకి 'నిజంగా కూతురు పుట్టిందనే స్వీట్లివ్వడానికొచ్చాడా... ఎర్రిబాగులోడులాగున్నాడు...' విమలమ్మ మాటలు విన్పించడంతో ఖంగుతిన్నాడు నరేంద్ర.

వాళ్లలా అనుకోవడంలో దాగున్న విషయం ఏమిటి? అర్థమేమైఉంటుంది? నన్ను ఎర్రిబాగులోడనడం కంటె... వీళ్లే వెర్రిబాగులోళ్లనడం సరిపోద్ది...' అనుకోవడంతో స్కూటర్ స్పీడందుకొంది.

అర్థంలేని మాటలు మాటాడ్డం కొంతమంది ప్రవృత్తా... లేక గొప్పగా తమకు తామే భావించి మాటాడ్తారా... ఏమైనా భలేవాళ్లు... అనుకుంటూ యిల్లుచేరాడు నరేంద్ర.

సాయంత్రం ఇంటి ముందు కారాగిన శబ్దం విన్పడ్డంతో... చూడగా... పొద్దున చూసిన సురేష్ కుటుంబం కారులోంచి దిగింది. నేరుగా పాప మంచం చుట్టూ చేరారు.

"ఉక్కపోస్తుంటే... పసిపిల్లకు యివెందుకు?" అంటూ విమలమ్మ బిడ్డపై ఉన్న గుడ్డ తీసింది.

"పుట్టీపుట్టక ముందే... ఈ డ్రాయర్లు బిగిం

చడం మంచిదికాదు...” అంది సురేష్ తల్లి.

“బిడ్డ వెయిట్ ఎంతుంది? చూసారా? ఆరోగ్యంగా ఉంది కదా...” అంది ఇందిర.

“ఏరా నరేంద్రా...పొద్దున మావాళ్లని ఆశ్చర్యంలో ముంచేసావటగా... ఆడపిల్ల పుట్టిందని చెప్పడం... ఇంద్రజాలం ఇంట్లో సంగతిక్కూడానా...” సురేష్ మాటలకి నరేంద్ర ఉలిక్కిపడ్డాడు.

“ఏమిట్రా నువ్వనేది...! నేను ఇంద్రజాలికున్నది నిజమే... ఇప్పుడేం చేసాను?

“అదేరా... అబ్బాయి పుడ్తే... అమ్మాయని చెప్పడం... స్వీట్లివ్వడం...”

“మేమూ అలాగే అనుకున్నాం. ఎటూ మాట్లాడలేక మౌనంగా ఉండిపోయాం” అన్నారు అంతకుముందు వచ్చి కూర్చున్న యింకో ఫ్రెండ్‌కి సంబంధించిన యిద్దరాడవాళ్లు.

నరేంద్ర చేయరానిదేదో చేసినట్టు... అందుకు అందరూ కూడబలుక్కుని నిందించడం చూసి... నరేంద్ర, భార్య ఆశ్చర్యంతో వొకర్నొకరు చూస్తూ కళ్లతో మాట్లాడుకున్నారు.


“పాప పాస్‌పోసింది” అంటూ డ్రాయర్ లాగేసింది నరేంద్ర భార్య.

అందరి కళ్లూ పాపను మరీ మరీ పరిశీలించాయి.

‘ఆడపిల్ల పుట్టిందని స్వీట్లు పంచడం వింతల్లోకెల్లా వింతగా తోచిందా? తమ భావన కంటే ఎదుటి వాళ్ల భావనలో మార్పుంటే అది అసహజమౌతుందా? ఎక్కువమంది అనుమానిస్తే



30-11-2008 ఆదివారం విజయవాడ చంద్ర రాజేశ్వరరావు స్మారక గ్రంథాలయంలో జరిగిన సిహెచ్.వి. సుబ్బారావు స్మారక రాష్ట్రస్థాయి కవితల పోటీ బహుమతి సభలో సభాధ్యక్షులుగా పాల్గొని 2007 మానస అవార్డు కవితా సౌరభాలను ఆవిష్కరిస్తున్న నాస్తికకేంద్ర అధ్యక్షులు లవణం, ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, విశాలాంధ్ర మాజీ సంపాదకులు సర్వజిత్ మరియు అకాడమి అధ్యక్షులు సిహెచ్.వి.ఎస్. బ్రహ్మానందరావు తదితరులు.



నిజం అబద్ధమౌతుందా? వీళ్లభిప్రాయంబట్టి అమ్మాయి అబ్బాయిగా మారదు కదా... ఆడ పుట్టుక హర్షించదగింది కాదా... ఆడజన్మ నిష్ప్రయోజనమా? నిష్ఫలమా?' అలా ఆలోచన్లు గజిబిజిగా అల్లుకున్నాయి నరేంద్రలో.

'వివిధ స్థాయిల్లో ఆడవాళ్లందించే మమతానురాగాల్ని మనస్ఫూర్తిగా అందుకోవడాన్కి అదృష్టవంతులై ఉండాలి. నిష్కపటులై ఉండాలి. నిష్కల్మషులై ఉండాలి. స్త్రీలో ఉన్న లాలిత్యం, ప్రేమ, వాత్సల్యం గుర్తించగల్గిన వారికే ఆడ పుట్టుక శుభవార్త'.

'మనిషిలో సంతోష సౌరభాలు నింపాలన్నా... వొంపాలన్నా... అది స్త్రీవల్లనే అవుతుంది. ఏ బిడ్డనయినా బాధ్యతగా, ఉన్నతంగా తీర్చిదిద్దడం ముఖ్యం. ఆడపిల్లలు తెలివితక్కువగా ఉండరు. ఈ కాలంలో కలెక్టర్లు, డాక్టర్లు, లాయర్లు ఇంకా చాలాచోట్ల ఆడవాళ్లున్నారాయె...'

అలా వొకరిమాట మరొకరందుకొన్నారు ముందుగా వచ్చి, మేడమీద నుంచి దిగివచ్చిన నరేంద్ర కొలీగ్స్.

'ఆడవాళ్లు తక్కువనే భావనతో మాట్లాడ్డం... ఊహించుకోవడం... అన్నీ స్వయంకృతాపరాధాలే... అవే నిల్చిపోయాయి జనాల్లో...' అంటున్నతన్ని చూసారు.

'బిడ్డను బిడ్డగా బాధ్యతగా పెంచడంలో ఖర్చూ ఒక్కలాగే వుంటుంది...' అంది నరేంద్ర భార్య.

మగబిడ్డను కంటేనే భార్యను ప్రేమగా చూసుకొనే భర్తలు, అత్తలు ఉన్నందువల్లే అదే ఆనవాయితీ అయివుంటుంది. అత్తగార్లంతా కొడుకుల మనసుల్లో కోడలి పట్ల అభిమానం, మన్నన నాటగలిగితే సమస్యలన్నీ తొలుగుతాయి. అలా చేసిన వాళ్లకు నేనే చెప్తాను "అత్తగారూ జిందాబాద్" అని నవ్వింది ఉమెన్ డెవలప్‌మెంట్ కోర్సు చేస్తున్న 'నవ్య'.

'అలా జరగాలి... జరగాలి...' అనుకొంది ఇందిర అందర్నీ చూస్తూ.